## క్లుప్తంగా

### విద్యార్థులకు కథల పోటీలు



పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

డుంబ్రిగుడ: మండల కేంద్రంలో ఉన్న శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా మంగళవారం గ్రంథాలయాధికారి శెట్టి సునీత ఆధ్వర్యంలో విద్యార్థులకు కథల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుతులు అందజేస్తామన్నారు. ఈ వేసవి శిబిరాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

### వైఎస్సార్ బీమా అందజేత



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దృశ్యం

కూనవరం: మర్రిగూడెం గ్రామానికి చెందిన దారా రాము ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా సచివాలయం సిబ్బంది అత్యవసర ఖర్చుల కింద రూ.10 వేలు నగదు మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ సంకీర్తన, కార్యదర్శి నాగేశ్వరరావు, మహిళా పోలీస్ నిరోషా, మాజీ సర్పంచ్ మంజుల, సచివాలయం కన్వీనర్ లక్ష్మణరావు, వార్డు మెంబరు ఆదిలక్ష్మి, గ్రామ వలంటీర్ విజయ పాల్గొన్నారు.

### గిరిజన సంఘం నూతన కార్యవర్గం

కొయ్యూరు: మండల గిరిజన సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం నిర్వహించిన మహాసభలో ఎన్నుకున్నారు. గిరిజన సంఘం అధ్యక్షుడిగా పాంగి పెంటయ్య, కార్యదర్శిగా పాంగి గంగరాజును ఎన్నుకున్నారు. మొత్తం 12 మందితో నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసినట్టు సంఘం నేతలు సూరిబాబు, అప్పలనాయుడు తెలిపారు.

### తాగునీటి సమస్య పరిష్కరించాలని వినతి



ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణకు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

కూనవరం: మండలంలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని సంబంధిత అధికారులు తక్షణం స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతూ సీపీఎం, జనసేన ప్రజాప్రతినిధులు మంగళవారం ఇన్‌చార్జి ఎంపీడీవో రామకృష్ణ, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ భానుప్రకాష్‌లకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ లింగాపురం, రేగులపాడు, కూటూరు, చూచిరేవులగూడెం తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరారు. వైఎస్ ఎంపీపీలు పెంటయ్య, సాంబశివరావు, ఎంపీటీసీలు అమ్మాజీ, జయసుధ, సీపీఎం నాయకులు నాగేశ్వరరావు, సీతారామయ్య, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

### బండెక్కిన అశ్వాలు



వ్యాన్‌లో తరలిస్తున్న గుర్రాలు

రాజవొమ్మంగి: సాధారణంగా మోటారు వాహనాల సామర్థ్యాన్ని అశ్వశక్తితో కొలుస్తారు. కాని ఆ అశ్వాలకు వయస్సుడిగిందో ఏమో ఆ వాహనాలలోనే ప్రయాణించాల్సి వచ్చింది. రాజవొమ్మంగి మండలం తంటికొండ గ్రామం ప్రధాన రహదారి ఈ దృశ్యం కనిపించింది. ఐదు భారీ అశ్వాలను ఓ చిన్న వ్యాన్‌లో తరలిస్తుండగా కంటపడ్డాయి. ఐదు గుర్రాలలో ఒకటి అప్పటికే ఎండవేడిమికి వ్యాన్‌లోనే సొమ్మసిల్లి పడిపోయింది. అశ్వాలను నర్సీపట్నం నుంచి విజయవాడకు తరలిస్తున్నట్టు వాహన యజమాని చెప్పారు.

# తీరిన వెతలు

- వంతెన నిర్మాణంతో ఆమూరు, సరళం గ్రామస్తులకు మోక్షం
- వేగవంతంగా పనులు
- ఆనందంలో గిరిజనులు



ఆమూరులో వంతెన నిర్మాణ పనులు



గెడ్డ ఉధృతితో నిలిచిన రాకపోకలు (ఫైల్)

హుకుంపేట: ఎన్నో ఏళ్ల నాటి గిరిజనుల కల నేరవేరింది. గ్రామాలకు అనుసంధానం చేసే వంతెన లేకపోవడంతో గిరిజనులు చాన్నాళ్లు నానా అవస్థలు పడ్డారు. ఆమూరు-మట్టుజోరు గ్రామాల మధ్య వారధి లేక వర్షాలు కురిసినపుడు గెడ్డ ఉధృతితో ఆరు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయేవి..ఇళ్లల్లోనే బిక్కుబిక్కుమంటూ గడిపేవారు..గత టీడీపీ హయాంలో వంతెన కోసం గిరిజనులు పలుమార్లు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోయింది. ప్రమాదకర గెడ్డపై వారధి లేక అత్యవసర పరిస్థితుల్లో ఆరు గ్రామాల గిరిజనులు పడ్డ ఇక్కట్లు వర్ణనాతీతం..అదంతా గతం.. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో శివారు గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తున్నాయి. ఇందులో భాగంగా ఆమూరు-మట్టుజోరు గ్రామాల మధ్య వంతెన పనులు జోరందుకున్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నాటి గిరిజనుల కల నెరవేరింది. సుమారు ఆరు గ్రామాల గిరిజనులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

**మంజూరైన నిధులు.. జోరుగా పనులు**

మండలంలోని తీగలవలస పంచాయతీ ఆమురు గ్రామంలో వంతెన నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఎస్‌సీఏ నిధులు రూ.40లక్షల వ్యయంతో నిర్మిస్తున్న ఈ వంతెన తీగలవలస పంచాయతీ ఆమురు, సరళం గ్రామాలతో పాటు మట్టుజోరు పంచాయతీల పరిధిలోని కుంతుర్ల, డబ్బబంద, పెట్టుగోడలు, రంగపల్లి గ్రామలతో పాటు పలు గ్రామాల గిరిజనులకు మోక్షం లభించనుంది. ఏళ్ల నాటి నుంచి ఈ గ్రామాలకు రహదారి ఉన్నప్పటికి మధ్యలో పెద్ద గెడ్డ అడ్డు రావడంతో గిరిజనులంత వర్షాకాలంలో గెడ్డ దాటలేక ఇబ్బందులు పడేవారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు కనీసం ఆస్పత్రికి కూడా వెళ్లడానికి అవకాశం లేక ఇంట్లో పరిమితమయ్యే వారు. వంతెన నిర్మించాలంటు గతంలో అధికారులకు, నాయకులకు పలుమార్లు వినతుల ద్వారా విన్నవించినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. పనులను గడవు లోగా త్వరితగతిన పూర్తి చేస్తామని అధికారులు చెబుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో రాగానే తమ సమస్యను తెలుసుకుని వంతెన నిర్మించడంతో మోక్షం లభించిందని ఆమూరు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు. జగనన్న ప్రభుత్వానికి రుణపడి ఉంటామని ఆయా ఆరు గ్రామాల గిరిజనులు చెబుతున్నారు.



వంతెన డెక్కింగ్ పనులు

### రుణపడి ఉంటాం



గెడ్డపై వంతెన నిర్మించకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డాం. గత టీడీపీ హయాంలో పాలకులు, అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చి తరువాత గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయి. ఇందులో భాగంగా గెడ్డపై వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉంది. పనులు ప్రస్తుతం శరవేగంగా జరుగుతున్నాయి. ఏళ్లనాటి కల నెరవేరింది. జగనన్న ప్రభుత్వానికి గిరిజనులంతా రుణపడి ఉంటాం.

– కొర్రి చిట్టిబాబు, వార్డు సభ్యుడు, ఆమూరు గ్రామం, హుకుంపేట మండలం

### నేడు వైద్య శిబిరం

రంపచోడవరం : స్థానిక పందిరిమామిడి ఉద్యాన వన కేంద్రం ఆవరణలో రాజమహేంద్రవరం డెల్టా ఆస్పత్రి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు డెల్టా ఆస్పత్రి మార్కెటింగ్ మేనేజర్ క్రాంతి, అసిస్టెంట్ మేనేజర్ కె. ప్రసాద్ పట్నాయక్ తెలిపారు. ఈ వైద్య శిబిరాన్ని బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సుగర్, బీపీ, ఈసీజీ తదితర వైద్య పరీక్షలు ఉచితంగా చేసి మందులు అందజేస్తామన్నారు. అవసరమైన వారికి వైఎస్సార్ ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్సలు చేస్తామన్నారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నేడు మోహనాపురంలో 'గడప గడపకు'

గంగవరం: మోహనాపురం సచివాలయం పరిధిలో లక్ష్మీపురం, శరభవరం గ్రామాల్లో బుధవారం మధ్యాహ్నం 3 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో బి.శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ముఖ్యఅతిథిగా హాజరవుతున్నట్టు పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పూర్తి సమాచారంతో హాజరుకావాలన్నారు.

**ఎమ్మెల్యే పర్యటన విజయవంతం చేయాలి**

మోహనాపురం పంచాయతీలో బుధవారం జరిగే గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరవుతున్నారని నాయకులు, కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని మండల పార్టీ కన్వీనర్ అప్పలరాజు, ఇన్‌చార్జి రఘునాథ్ తెలిపారు.

# డెంగ్యూపై అవగాహన



ఆర్వీనగర్‌లో డెంగ్యూపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్, సిబ్బంది



కూనవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న డాక్టర్, వైద్య సిబ్బంది

గూడెంకొత్తవీధి: డెంగ్యూ వ్యాధిని తరిమికొట్టాలని ఆర్.వి.నగర్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సౌమ్య అన్నారు. డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని ఆర్.వి.నగర్‌లో వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డెంగ్యూ లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమతెరలు వినియోగించాలని సూచించారు.

రాజవొమ్మంగి: దోమలను నివారించి డెంగ్యూ వంటి మహమ్మారి వ్యాధులకు దూరం ఉండాలని జడ్డంగి, రాజవొమ్మంగి, లాగరాయి పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లు సేవా సుజి, యామిని ప్రియ, ఉషశ్రీ, రవీంద్ర, శ్రీదుర్గ తదితరులు గ్రామాల్లో అవగాహన కల్పించారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఈ కార్యక్రమం జరిగింది. మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ ఆధ్వర్యంలో ఆశ, ఏఎన్‌ఎం తదితర సిబ్బంది ప్లకార్డులు, బ్యానర్లు చేత పట్టి ర్యాలీలో పాల్గొన్నారు. ప్రజల భాగస్వామ్యంతోనే డెంగ్యూ వ్యాధి నివారణ సాధ్యమన్నారు.

కూనవరం: జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా కూనవరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక వైద్యాధికారి రాజీవ్ మాట్లాడుతూ ఇంటిలోపల, బయట ఆవరణలోను ఉండే దోమల వల్ల వ్యాధి వ్యాపిస్తుందన్నారు. ఈ దోమ కాటు వల్ల మూడు నుంచి 14 రోజుల్లో వ్యాధి ప్రబలే అవకాశం ఉందన్నారు. డెంగ్యూపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమతెరలు వినియోగించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్, హెల్త్ అసిస్టెంట్, ఏఎన్‌ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

### ఘనంగా పరదేశమ్మ పండగ



పోతురాజుబాబు వద్ద పూజలు చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి

చీడికాడ: తురువోలులో పరదేశమ్మ పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పోతురాజుబాబుకు మొక్కులు చెల్లించుకున్నారు. దేవరాపల్లి, చీడికాడ జెడ్పీటీసీలు కర్రి సత్యం, లాలం శారదాజానకీరాం, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

### కనులపండువగా తలుపులమ్మ తల్లి పండగ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కోటవురట్ల : కె.తంగేడు గ్రామంలో తలుపులమ్మ తల్లి పండగను మంగళవారం వైభవంగా జరిపారు. గ్రామ శివారున చెరకు కాటా సమీపంలో ఉన్న తలుపులమ్మతల్లి ఆలయంలో భక్తులు అమ్మవారికి పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్.సీతారామరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్.ఎస్. రామచంద్రరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణరాజు, లక్ష్మీ నరసింహరాజు పాల్గొన్నారు.

# నాడు–నేడు పనుల పరిశీలన



ఎల్లవరం పాఠశాలలో భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంఈవో మల్లేశ్వరరావు

అడ్డతీగల: ప్రభుత్వం నిర్దేశించిన ప్రమాణాలతో నాడు-నేడు పథకంలో చేపట్టే భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఎంఈవో వై.మల్లేశ్వరరావు అన్నారు. మండలంలోని ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ పాఠశాలల్లో నాడు-నేడు పథకంలో నిర్మిస్తున్న అదనపు భవనాలు, మరుగుదొడ్ల పునర్నిర్మాణ పనులను ఆయన మంగళవారం తనిఖీ చేశారు. మంజూరైన నిధులతో చేపట్టిన పనులు, ప్రతిపాదిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాల్లో వాడుతున్న సామగ్రి తదితర అంశాలపై ఆరా తీశారు.ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు-నేడు పథకం పనులను పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని హెచ్‌ఎంలకు సూచించారు. హెచ్‌ఎంలు రజినీకుమారి, ప్రభ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రెజ్లర్లకు మద్దతుగా ర్యాలీ



అరుకులోయలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఐద్వా, ప్రజా సంఘ నాయకులు

అరుకు రూరల్: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్‌సింగ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని ఐద్వా సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు జయ తదితరులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని మండల ప్రజా సంఘాల నేతలు, గిరిజన మహిళ సంఘం నేతలతో కలిసి క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా రెజ్లర్ల తమ న్యాయం కోసం నెలల తరబడి నిరసన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవటం దారుణమన్నారు. రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళ చట్టాలు, హక్కులను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామరావు, ముగ్గన్న, సుజాత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి సేద్యంతో భూములు సారవంతం



జి.భీమవరంలో ప్రకృతి వ్యవసాయం నిర్వహణ రికార్డులను పరిశీలిస్తున్న స్వామినాయుడు



ప్రకృతి సాగు బొప్పాయిని పరిశీలిస్తున్న స్వామినాయుడు

- ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా అదనపు మేనేజర్ స్వామినాయుడు

కశింకోట :వర్షాధార భూముల సారవంతానికి చిరు, నవ ధాన్యాలు నాటుకోవాలని ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు జిల్లా అదనపు మేనేజర్ ఆర్.స్వామినాయుడు రైతులను సూచించారు. మండలంలోని జి.భీమవరం గ్రామంలో మంగళవారం చిరు ధాన్యాలు నాటిన భూముల్లో మొలకలు, మొక్కల ఎదుగుదలను పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయంతో పండించిన బొప్పాయి తోటను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలకరి వర్షాల్లో 30 రకాల చిరు ధాన్యాలు, నవ ధాన్యాలను రైతులు జల్లుకోవాలన్నారు. ఇవి మొలకలు వచ్చి ఎదిగిన 45 రోజులకు కలియదున్నితే భూమి సారవంతమవుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులు తమ భూముల్లో చిరు ధాన్యాలు నాటేలా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయంలో ప్రతి రోజూ ఆదాయం వచ్చే ఆకుకూరలు, కూరగాయలు తదితర పంటలను సాగు చేసుకోవడం ద్వారా ఏటీఎం మాదిరిగా రోజూ ఆదాయం పొందవచ్చన్నారు. ప్రకృతి వ్యవసాయంతో పొలాలు, గ్రామాలు బాగు పడతాయని, ప్రజలు ఆరోగ్యవంతులుగా జీవిస్తారని పేర్కొన్నారు. ప్రతి ఇంటి వద్ద కిచెన్ గార్డెన్ వేసుకోవాలన్నారు. దీనివల్ల బజారుకు వెళ్లి కూరగాయలు కొనుక్కోవాల్సిన అవసరం ఉండదన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రికార్డులను ఆయన తనిఖీ చేశారు. రైతులకు సరఫరా చేస్తున్న చిరు ధాన్య విత్తన కిట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ జి.అనిత, ప్రకృతి వ్యవసాయం మండల ఇన్‌చార్జి ద్వారపురెడ్డి రమణ, ప్రతినిధులు డి.వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : మండల కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో గణపతి ఆలయ వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, నిర్వాహకులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి హోమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

# ఆరోగ్యవంతమైన సమాజానికి ఆయుర్వేదం

- ఈ నెల 20 నుంచి కోడూరులో ఆయుర్వేదంపై అవగాహన

అనకాపల్లిటౌన్ : మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని, ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆయుర్వేద వైద్యులు సుందర రాజపెరుమాళ్లు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో ఆరోగ్య ధాత్రి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 20 నుంచి ఆయుర్వేదంలో ఏడవ సప్తాహం ప్రారంభించనున్నట్టు తెలిపారు. ఇందులో పాల్గొనే వ్యక్తులు ముందుగా రూ.వెయ్యి చెల్లించాలని, వారం రోజుల శిక్షణ అనంతరం నగదు తిరిగి ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. ఉత్కృష్టమైన హఠయోగ సాధనకులు, యోగాచార్యులు రామలింగ వెంకట సత్యనారాయణచే అతి ప్రాచీనమైన అష్టాంగ యోగ సాధన, ఆయుర్వేద జీవన విధానాన్ని శిక్షణలో పాల్గొన్నవారికి అందించనున్నట్టు వెల్లడించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ధ్యేయంగా ఆయుర్వేదం ఉద్భవించిందన్నారు. ఆరోగ్యం కాపాడుకోవడానికి సులువైన సూక్ష్మమైన వ్యాయామం నుంచి అతి క్లిష్టమైన ఆసనాల వరకూ నిరంతరం సాధన చేయించనున్నట్టు పేర్కొన్నారు. సప్త ధాతువుల నుంచి ప్రతి కణం వరకు ఆమూలాగ్రం శుద్ధి చేసే షట్ క్రియల సాధన, నూతన కణముల ఉత్పాదన ద్వారా స్వాస్థ్య స్థాపనకు అత్యంత ప్రాచీన ప్రాణాయామ సాధన, బాహ్య వాతావరణంతో పాటు అంతఃశుద్ధికి నిత్యాగ్ని హోత్ర విధానంలో శిక్షణ ఉంటుందన్నారు.

### స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ



కశింకోట గ్రంథాలయంలో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌పై శిక్షణ

కశింకోట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిష్, గ్రామర్‌పై శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఉపాధ్యాయుడు సూరా శ్రీనివాస్ ఆంగ్లంపై మెలకువల్ని బోధించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.వి.వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పడం, పాటలపోటీ, లెమన్ అండ్ స్పూన్ ఆట నిర్వహించారు. వీటిలో విజేతలైన ఎ.ప్రవీణ్ ప్రజ్ఞాన్, ఎస్.పావని లక్ష్మి, ఎం.శ్రీవైష్ణవి, కె.భవ్యశ్రీ, కె.లావణ్య, పి.జ్యోత్స్నప్రియలకు ఉపాధ్యాయుడు బి.సురేష్‌కుమార్ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం పాల్గొన్నారు.

# ఉత్సాహంగా ఫేర్‌వెల్ డే వేడుకలు




నృత్యం చేస్తున్న విద్యార్థినులు

నర్సీపట్నం: బి.ఆర్.అగ్రికల్చర్, ఫిషరీ, వెటర్నరీ కళాశాల ఫేర్‌వెల్ డే వేడుకలను మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చింతకాయల సన్యాసిపాత్రుడు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అగ్రికల్చర్, వెటర్నరీ కోర్సులకు ఎంతో ఆదరణ ఉందన్నారు. కళాశాల యాజమాన్యం కొత్త కోర్సులు తీసుకువచ్చి గ్రామీణ విద్యార్థుల ఉద్యోగ కల్పనకు బాటలు వేస్తుందన్నారు. ప్రభుత్వం వసతి దీవెన, విద్యా దీవెన పథకాల ద్వారా విద్యార్థులకు ఆర్థిక తోడ్పాటునందిస్తుందన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కళాశాల వెటర్నరీ ప్రిన్సిపాల్ సురేష్, అగ్రికల్చర్ ప్రిన్సిపాల్ సుధీర్, ఫిషరీ ప్రిన్సిపాల్ రమేష్ పాల్గొన్నారు.

### సైబర్ మోసాలపై అప్రమత్తం



టీవీల ద్వారా ప్రచారం చేస్తున్న దృశ్యం

మునగపాక : మహిళలు మోసాలకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. నేరాల నియంత్రణపై ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకుంటున్నాయన్నారు. మంగళవారం మునగపాక పరదేశమ్మతల్లి గుడి వద్ద ఉపాధిహామీ పథకం కూలీలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యంగా ఏటీఎంలు వినియోగించేటపుడు, అలాగే ఓటీపీ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ మోసాలు పెరిగిపోతున్నందున ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలన్నారు. వీడియో ద్వారా వివరించారు. మహిళా పోలీసులు వరలక్ష్మి, శ్రావణి సంయుక్త నిర్వహణలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అచ్చియ్యనాయుడు, సర్పంచ్ దిమ్మల అప్పారావు పాల్గొన్నారు.

### 1 నుంచి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ

అచ్యుతాపురం(అనకాపల్లి): స్థానిక ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో జూన్ 1వ తేదీ నుంచి ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఏడాది పాటు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇవ్వనున్నట్లు కళాశాల యాజమాన్యం మంగళవారం పేర్కొంది. 18 నుంచి 30 సంవత్సరాల లోపు మధ్య వయస్సు గల వారు ఈ శిక్షణకు అర్హులని తెలిపింది. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.1000 స్టైఫండ్ ఇవ్వనున్నట్టు తెలిపారు. మరిన్ని వివరాలకు 9701241753 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

- అరుణవర్ణ శోభితం



సూర్యాస్తమయం సమయంలో భూపతిపాలెం ప్రాజెక్టులోని నీటిపై సూర్యకాంతి పడడంతో నీరంతా అరుణవర్ణంగా మారింది. ఈ దృశ్యం చూపరులను ఎంతో ఆకట్టుకుంది. – రంపచోడవరం